నమస్తే తెలంగాణ
నల్లగొండ

5 | నల్లగొండ, శనివారం 13 ఏప్రిల్ 2024 | NALGONDA

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

• ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 12 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నందున రైతుల పట్ల ధాన్యం కొనుగోలు వ్యాపారులు సానుకూలంగా స్పందించాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి రైతుల పక్షాన నిలువాలని ఇది రైతుల కష్టానికి, వ్యవసాయానికి ఇచ్చే గౌరవమని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు సరైన గౌరవం, మద్దతు ధర లభిస్తే వ్యవసాయం ఇంకా వృద్ధితో ముందుకు సాగుతుందన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతును ధాన్యం కొనుగోలు పేరిట దళారులు ఎవరైనా మోసం చేస్తే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మోసాలకు పాల్పడే వారిని నమ్మవద్దని, గుర్తింపు లేని వారికి ధాన్యం అమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని రైతులకు ఎస్పీ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్

గుంపు మేస్త్రీకి గుణపాఠం చెబుదాం

- ఎంపీ సీట్ల కేటాయింపులో బలహీన వర్గాలకు బీఆర్ఎస్ పెద్దపీట
- పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఇబ్రహీంపట్నం/ ఆదిబట్ల, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గుంపు మేస్త్రీకి గుణపాఠం చెబుదామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం బొంగుళూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీ సీట్ల కేటాయింపులో బీఆర్ఎస్ బలహీన వర్గాల వారికి పెద్ద పీట వేసిందన్నారు. అందులో భాగంగా భువనగిరి స్థానంలో క్యామ మల్లేశ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆర్థిక ప్రగతితోనే సమానత్వం వస్తుందన్న జ్యోతిరావు పూలే, అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ ఆచరణలో చూపించారన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసినట్లు తెలిపారు. 1008 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించామన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశామని, రూ.11 వేల కోట్లతో గొల్లకురుమలకు సబ్సిడీపై గొర్రెలు, రూ.35 వేల కోట్లతో మత్స్యకారులకు చేప పిల్లలను అందజేశామని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలతో నేతన్నలకు అండగా నిలిచామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉన్నదని, ఒకరిద్దరు అవకాశవాద నేతలు పార్టీని వీడినంతమాత్రాన జరిగే నష్టమేమీలేదని అన్నారు. స్థానికుడైన భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను 50వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, దండె రాంరెడ్డి, జక్క రాంరెడ్డి, ఎంపీపీ కృపేశ్, జడ్పీటీసీ జంగమ్మ, ఆయా మండలాల అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది

భువనగిరి పార్లమెంటు అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన బీఆర్ఎస్‌కే ఓట్లు అడిగే హక్కు ఉంది. గతంలో ఎంపీగా ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది శూన్యం. ఈ నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట ఆలయాన్ని అత్యధిక నిధులతో తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దే. బలహీన వర్గాలకు చెందిన నన్ను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా. అవకాశవాద రాజకీయాలతో పార్టీ మారిన బీజేపీ అభ్యర్థి, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థికి తగిన గుణపాఠం చెప్పాలి.

- క్యామ మల్లేశ్, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

మోసకారి కాంగ్రెస్‌ను బొంద పెట్టాలి

వచ్చిన కరువు కన్నా.. కాంగ్రెస్ తెచ్చిన కరువే ఎక్కువ

- పంటలు ఎండి ఇప్పటికే 200 మంది రైతుల ఆత్మహత్య
- పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- జిల్లా మంత్రులు అసరమర్థులు
- గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి
- పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి , వేదికపై మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు

నేరేడుచర్ల/ కోదాడ, ఏప్రిల్ 12 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో బొంద పెట్టాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో శుక్రవారం నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 60ఏండ్ల ఏండ్ల కాంగ్రెస్ పాలన పరాకాష్ఠకు ఎడారిగా మారిన ఉమ్మడి నల్లగొండ జిల్లా పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కళకళలాడి దేశానికే అన్నపూర్ణగా మారిందన్నారు. అలాంటి జిల్లా అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మళ్లీ ఎడారిగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోతున్న పంటలకు నీళ్లిచ్చే అవకాశం ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు అన్నీ మూసుకొని కూర్చొని అసమర్థులుగా మిగిలిపోతున్నారన్నారు. నాడు చంద్రబాబు, వైఎస్ఆర్ హయాంలో ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుంటే మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఉన్న ప్రస్తుత ఇద్దరు మంత్రులు నోరు మూసుకున్నారని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో ఎండగట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో 420 హామీలిచ్చి, వంద రోజుల్లోనే నెరవేర్చుతామన్న కాంగ్రెస్ పార్టీ 120 రోజులైనా ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కడా ఎకరం పంట కూడా ఎండిపోలేదని, ఏ ఒక్క రైతూ చనిపోలేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతుబంధు అందక చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏదైనా కారణాలతో రైతు చనిపోయిన 10 రోజుల్లోనే ఆ కుటుంబానికి రైతు బీమా కింద రూ.5లక్షలు అందేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీమా సొమ్ము చెల్లించకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న రెండు వందల రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ధ్వజమెత్తారు. రూ.4వేల పింఛన్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు పెంపు, మహిళలకు రూ.2500, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎందుకు చేయలేదో గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు ఉన్న పరిస్థితి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పునరావృతం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సాధించుకొని అభివృద్ధి చేసుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి కరుణించక వచ్చిన కరువు కన్నా కాంగ్రెస్ పార్టీ ముందు చూపులేని విధానంతో తెచ్చిన కరువే ఎక్కువ అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో సాగర్ డ్యామ్‌లో 508 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు కూడా పంటలకు నీరు అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 515 అడుగులకు పైగా నీళ్లు ఉన్నా సాగర్ నీటిని విడుదల చేయకుండా పంటలను ఎండబెట్టిందని దుయ్యబట్టారు. సాగర్ నీటిని ఖమ్మం జిల్లా పాలేరుకు రెండు సార్లు తరలించుకుపోతుంటే ఇక్కడి మంత్రులు మౌనంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతుల్లో ధైర్యం నింపడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎండిన పంటలను పరిశీలిస్తే లాగులు తడిచిన ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలిపోతుందని మొత్తుకున్న ప్రభుత్వం తరువాత నీటిని ఎలా విడుదల చేసిందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అబద్దాలతో పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడే నాటికి 6గంటల విద్యుత్ అందేదని, రాష్ట్ర అప్పు రూ.22వేల కోట్లు ఉన్నదని, అది ఐదేండ్లకు రూ.44 వేల కోట్లు అయ్యిందని, మరో ఐదు సంవత్సరాలకు రూ.88వేల కోట్లకు చేరిందని తెలిపారు. తాము 24 గంటల విద్యుత్ అందించామని, విద్యుత్ సంస్థల ఆస్తి లక్షా 40వేల కోట్లు ఉన్నదని చెప్పారు. డిసెంబర్ 9న ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ తొలి సంతకం చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మిల్లర్లను బెదిరించి కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయాలన్నా ఢిల్లీకి కప్పం కట్టాల్సిన పరిస్థితి ఉన్నదని ఆరోపించారు. బీజేపీ పాలనలో ధరలు విపరీతంగా పెరిగి ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తెలగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి 1200 మంది రైతుల మరణానికి కారణమైన బీజేపీకి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని, బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, ఎంపీపీలు లకుమళ్ల జ్యోతి, పార్వతి, జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు అప్పిరెడ్డి, రంగాచారి, ఆయా మండలాల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోదాడలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

నేను మధ్య తరగతి రైతు కుటుంబానికి చెందినవాడిని. రైతుల కష్టాలు, బాధలేంటో తెలిసినవాడిని. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ నన్ను నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా నిలిపారు. నన్ను గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనను, 110 రోజుల కాంగ్రెస్ పాలనను ప్రజలు కళ్లారా చూశారు. అలవికాని వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ అమలు చేయలేక చేతులెత్తేసింది. రైతులను, మహిళలను, నిరుద్యోగులను ధోకా చేసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపితే రేవంత్‌రెడ్డి సర్కారు రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసింది. కాంగ్రెస్ పాలనలో కరువు విలయతాండవం చేస్తుంది. సాగర్ ఎడమ కాల్వ కింద పంటలు ఎండిపోతుంటే జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి సాగునీరు అందించకపోవడం దురదృష్టకరం. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2500 ఇవ్వకపోవడం, రైతుబంధులో కోత విధించడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షా 60 వేల ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ సర్కారు ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. కేసీఆర్ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు, మూడు పథకాలు అమలు చేసి చేతులు దులుపుకొంది. మీ సమస్యలను పార్లమెంట్‌లో వినిపించి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. అత్యధిక మెజార్టీ వచ్చేవిధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలి.

- కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి

దివాలాకోరు ప్రభుత్వం

సాగునీరు అందక సాగర్ ఎడమ కాల్వ కింద పొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పోలీసు పహారా పెట్టి నీళ్లు తరలిస్తుంటే.. జిల్లా మంత్రులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. దీంతో రైతులపై వారికున్న కపట ప్రేమ బట్టబయలైంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాగర్ డెడ్ స్టోరేజీలో ఉన్నా సాగునీరు అందించడంతోపాటు చెరువులను నింపింది. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అనే విషయం మర్చిపోయి అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారు. రాష్ట్రంలో పూర్తిగా దళారుల రాజ్యమైంది. రెండు లక్షల రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు రైతుల ఇళ్లకు వచ్చి జప్తు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇవ్వడం చేతకానప్పుడు ఎందుకు హామీ ఇవ్వాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించాలి.

- బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం చేయాలి

బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి కంచర్ల కృష్ణారెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలి. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నెరవేర్చలేక చేతులు ఎత్తేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే ప్రజల విశ్వసనీయతను కోల్పోయింది. ఈ ప్రభుత్వానికి ఎందుకు ఓటేశామని అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలోని అన్ని చెరువులను సాగర్, కాళేశ్వరం జలాలతో నింపాం. మోత్కూరు, నడిగూడెం, మునగాల మండలాల్లో పది వేల ఎకరాలకు కాళేశ్వరం నీళ్లు ఇచ్చాం. ఇప్పుడు సాగునీరు అందకపోవడంతో చేతికొచ్చిన పంట ఎండిపోయింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీలో ఉన్నప్పుడు కూడా సాగునీరు అందించారు. హామీలను అమలు చేయని అసమర్థ కాంగ్రెస్ పార్టీ గురించి ప్రజలకు వివరించి బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

- బొల్లం మల్లయ్యయాదవ్, కోదాడ మాజీ ఎమ్మెల్యే

ప్రజల విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్

అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభత్వం వంద రోజుల్లోనే ప్రజల విశ్వసనీయతను కోల్పోయింది. ప్రజలకు ఇచ్చిన హామీలు కనీసం పది శాతం కూడా అమలుకు నోచుకోలేదు. రైతుల రుణమాఫీ ఊసేలేదు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నాయకులను దుర్భాషలాడటమే తప్ప ప్రజల సంక్షేమాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆ పార్టీలో ఎవరూ చిచ్చు పెట్టాల్సిన అవసరం లేదు. భవిష్యత్‌లో వాళ్లకు వాళ్లే తన్నుకుంటారు. అది కాంగ్రెస్ నైజం. కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు లేరు. బీఆర్ఎస్ నాయకులే వారికి దిక్కయ్యే దుస్థితి ఏర్పడింది. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనను ప్రజల్లో ఎండగట్టి బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని గెలిపించాలి.

- ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్

వర్షంతో ఉలిక్కిపాటు

కొనుగోలు కేంద్రాల్లో అక్కడక్కడ పాక్షికంగా తడిసిన ధాన్యం

- అకాల వర్షానికి పంటను కాపాడుకునే ప్రయత్నంలో అన్నదాత
- పంట కోయని రైతుల గుండెల్లో అలజడి రేపిన వరుణుడు
- ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనానికి ఊరట

నల్లగొండ శివారులోని ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు

నల్లగొండ, ఏప్రిల్ 12 : జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షం అన్నదాతను ఉలిక్కిపడేలా చేసింది. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం కాపాడుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇంకా కోత దశలో ఉన్న పంటకు ఎలాంటి నష్టం జరుగుతోనని ఆందోళన చెందారు. అయితే.. పది రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలతో నిప్పుల కొలిమిలా మారిన నల్లగొండ జిల్లా జనానికి కాస్త ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు. జిల్లాలో పది మండలాల్లో పాక్షిక వర్షం కురువడంతో పెద్దగా నష్టం జరుగకపోయినప్పటికీ అక్కడక్కడ పాక్షికంగా ధాన్యం తడిసింది. ఇక ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటి వరకు 63,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. అందులో 738 మెట్రిక్ టన్నులు మిసహాయిస్తే మిగిలిన ధాన్యం మిల్లుల్లోకి తరలించడం వల్ల కొన్న వడ్లు పెద్దగా తడవలేదని అధికారులు అంటున్నారు. జిల్లాలో మొత్తం 370 కేంద్రాల్లో కొనుగోలు చేస్తుండగా ఇంకా లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం ఆయా కేంద్రాల్లో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ధాన్యం తడవకుండా అన్నదాతలు ఎంతో ప్రయాస పడాల్సి వచ్చింది.

పలు కేంద్రాల్లో పాక్షికంగా తడిసిన ధాన్యం

జిల్లాలో శుక్రవారం పది మండలాల్లో వర్షం కురువగా అత్యధికంగా కనగల్ మండలంలో 21.3 మి.మీ, వేములపల్లిలో 15.3, త్రిపురారంలో 13.3, తిప్పర్తిలో 5.8, నల్లగొండ, గుండ్లపల్లిలో 4.5 మి.మీ. వర్షం పడింది. చండూరు, చింతపల్లి, నాంపల్లి, దేవరకొండ మండలాల్లో 0.8 మి.మీ. వర్షం కురిసింది. దాంతో ఆయా మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పాక్షికంగా తడిసినట్లు అధికారులు, సెంటర్ నిర్వాహకులు అంటున్నారు. కొన్న ధాన్యంలో సింహభాగం ఇప్పటికే మిల్లులకు తరలించగా.. ఇంకా తూకం కాని వడ్లు ఎక్కువగా తడిసినట్లు తెలుస్తుంది.

నల్లగొండలో కురుస్తున్న వర్షం

అకాల వర్షంతో కాస్త ఉపశమనం

జిల్లాలో పది రోజులుగా 43 నుంచి 45 డిగ్రీల మేరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాంతో ప్రజలు ఈ ఎండ వేడిమికి తాళలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో కూలర్లు కూడా పని చేయని పరిస్థితుల్లో శుక్రవారం పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షం కాస్త ఉపశమనం కలిగించిందని చెప్పవచ్చు. పొద్దున దాకా ఎండతోపాటు ఉక్కపోత ఉన్నప్పటికీ సాయంత్రం పడ్డ వర్షం ఉపశమనం కలిగించింది. పది రోజులుగా సగటున 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, శుక్రవారం 39 డిగ్రీలకు పడిపోయింది.

ధాన్యం కొనుగోళ్లలో వివక్ష

- అధికార పార్టీ వారివే కొంటున్నారని ధర్నా
- కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తీసుకెళ్లిన రైతులు

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 12 : ధాన్యం కొనుగోళ్లలో ఐకేపీ నిర్వాహకులు వివక్ష చూపుతున్నారని వాపోతూ కొందరు రైతులు జి.యడవెల్లిలో కనగల్ – చండూరు రహదారిపై శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కనగల్ మండలంలోని జి.యడవెల్లి గ్రామ ఐకేపీ సెంటర్‌లో సీరియల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయకుండా తేమ పేరుతో రాజకీయం చేస్తున్నారన్నారు. అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికార పార్టీ నాయకుడి ఒత్తిడి మేరకు ఐకేపీ కేంద్ర నిర్వాహకులు పని చేస్తున్నారని, సీరియల్ లేకుండా ఇష్టానుసారంగా ధాన్యం కాంటా వేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర నిర్వాహకులు కూడా సదరు నాయకుడి వద్దకు వెళ్లి అడగాలని సూచిస్తున్నారన్నారు. కాగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కొందరు రైతులు తమ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రం నుంచి తీసుకొని వెళ్లిపోయారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా చేస్తున్న రైతులు

అధికార పార్టీ వారి ధాన్యమే కాంటా వేస్తున్నారు..

ఐకేపీలో పోసిన ధాన్యాన్ని సీరియల్ లేకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన వారివి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. నాది 42వ సీరియల్ నంబర్ ఉన్నప్పటికీ నా ధాన్యం కాంటా వేయకుండా, 182వ నంబర్ వారి ధాన్యాన్ని కాంటా వేశారు. ఈ విషయాన్ని సెంటర్ వారిని అడిగితే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడి దగ్గరికి వెళ్లి అడగమంటున్నారు.

- గడ్డం శ్రావణ్, రైతు

జాప్యం మాట వాస్తమే..

కొందరు రైతులు ఐకేపీ సెంటర్‌లో కాకుండా పక్కన ప్రైవేట్ స్థలంలో ధాన్యాన్ని పోశారు. వారి ధాన్యానికి పీఏసీఎస్ నిర్వాహకులు నంబరు కేటాయించారు. కానీ.. ఆ రికార్డును ఐకేపీకి ఇవ్వలేదు. దాంతో సీరియల్ మారింది. అయినా కొనుగోలు చేస్తున్నాం. ముగ్గురు, నలుగురు రైతుల ధాన్యం మాత్రమే పక్కన ఉన్నాయి. ఈ రోజు రాత్రి వారివి కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ లోపు ధాన్యాన్ని తీసుకుపోయారు. ఇక్కడ రాజకీయం ఏమీ లేదు.

- సంకు హరి, ఏపీఎం